

ఎప్పుడిస్తారో చెప్పండి..

ఐదేళ్ల తర్వాత రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా ఆచరణలో ముందడుగు పడటం లేదు. 8లో



నిమజ్జనానికి బారులు

భద్రాచలం వద్ద గోదావరిలో గణనాథుల నిమజ్జనం మూడో రోజూ కొనసాగగా, వందలాదిగా వాహనాలు బారులు తీరాయి. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉక్కపోత వాతావరణం ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచాలతో రామయ్య దర్శనం..



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం జరిపారు.

రామయ్య సేవలో ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్



ఆలయ ప్రాంగణంలో కుటుంబ సభ్యులతో కొమ్మినేని శ్రీనివాసరావు, తదితరులు

శ్రీ సీతారామ చంద్రస్వామివారిని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని, ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వేదాశీర్వచనం చేయగా, ఈఓ పట్టువస్త్రాలను, స్వామివారి జ్ఞాపికను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ రమాదేవి, ఆలయ ప్రధాన అర్చకులు, విజయరాఘవన్, ఏఈఓ భవాని రామకృష్ణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లింగాల సాయిబాబు, తిలక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూపు మారని భద్రగిరి



గత ఆగస్టులో గోదావరి వరద పోటుకు రామాలయం చుట్టూ చేరిన నీరు

భద్రాచలంపై 'తెలంగాణ' ముద్ర ఎక్కడ?

- కేసీఆర్ హయాంలో ఊరూవాడ అభివృద్ధి
- దక్షిణ అయోధ్యలో మచ్చుకైనా కనిపించని మార్పు
- ఇన్నాళ్లకు మొదలవుతున్న కరకట్ట విస్తరణ పనులు
- నేడు మంత్రి కేటీఆర్ పర్యటన

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ వచ్చిన తర్వాత కనీవినీ ఎరుగని రీతిలో యాదగిరిగుట్ట అభివృద్ధి చెందింది. కొత్త జిల్లాలు ఏర్పడ్డాయి. ఆ జిల్లాల్లో పల్లె, పట్నం తేడా లేకుండా అన్ని ఊళ్లలో గ్రామీణ క్రీడా ప్రాంగణాలు, ప్రకృతి వనాలు, ఓపెన్‌జిమ్ తదితర సౌకర్యాలు సమకూరాయి. ప్రభుత్వ ఆస్పత్రులు మెరుగయ్యాయి. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత ఏ విధంగానూ రూపురేఖలు మారని ఊరు రాష్ట్రం మొత్తంలో ఏదైనా ఉందా? అంటే.. భద్రాచలమని టక్కున సమాధానం చెప్పడం అతిశయోక్తి కాదు. గడిచిన పదేళ్లుగా ఇక్కడి నుంచి ప్రజాప్రతినిధులుగా గెలిచిన వారికి సరైన వ్యూహం లేకపోవడంతోపాటు రాష్ట్ర విభజన, స్థల లభ్యతను సాకుగా చూపుతూ పాలకులు కాలం గడుపుతున్నారు. చివరకు భద్రాచలమంటే శ్రీరామనవమి, ముక్కోటి పండగలకు తాతాల కాలం నాటి ఏర్పాట్లు, గోదావరి వరదలప్పుడు సహాయ కార్యక్రమాలు చేపడితే చాలు అనే పరిస్థితి నెలకొంది. రెండు సార్లు అధికారంలో ఉన్న కేసీఆర్ సర్కార్, ఇక్కడ చేపట్టిన పని ఇదీ అని గర్వంగా చెప్పుకోవడానికి ఏమీ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖమంత్రి కేటీఆర్ భద్రాచలంలో పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. కేవలం నెల రోజుల వ్యవధిలోనే కరకట్ట నిర్మాణానికి రూ.38 కోట్ల నిధులు మంజూరు చేయడమే కాదు ఆ పనులకు శంకుస్థాపన కూడా చేస్తున్నారు. ఇదే ఒరవడితో భద్రాచలం భవిష్యత్ కోసం ఇక్కడ వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగు నీటి వ్యవస్థలో లోపాలు..

పట్టణంలో మురుగు నీరు వ్యవస్థలో లోపాల కారణంగా పూర్తి స్థాయిలో కరకట్ట నిర్మాణం చేసినా వానాకాలంలో స్థానికంగా కురిసే వర్షాలతో ఆలయ పరిసర ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. దీన్ని నివారించేందుకు ప్రస్తుతం గోదావరిలో కలిసే మురుగునీరు స్లూయిస్ పాయింట్‌ను మరింత దిగువకు తీసుకెళ్లే విధంగా డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించాలని పట్టణవాసులు కోరుతున్నారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కూడా నిర్మించాలనే డిమాండ్ వస్తోంది.

నిమజ్జనం ఘాట్ నిర్మించాలని భక్తుల డిమాండ్

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు భద్రాచలం తీసుకువస్తుంటారు. ఇక్కడ నిమజ్జనం కోసం వచ్చిపోయే వాహనాల కోసం విశాలమైన రోడ్లు, గోదావరి తీరం వెంబడి ప్రత్యేకంగా ఘాట్‌ను నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. బతుకమ్మ ఆడేందుకు వీలుగా కరకట్ట వెంబడి ప్రత్యేకంగా స్థలాన్ని గుర్తించి అక్కడ మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇలా కల్పించే సౌకర్యాలు నిమజ్జనం, బతుకమ్మలు ముగిసిన తర్వాత ముక్కోటి, నవమిల సందర్భంగా సాధారణ భక్తులకు విస్తృతంగా ఉపయోగపడతాయి.

పదేళ్లుగా అభివృద్ధి పనులే లేవ్..

కరకట్ట నిర్మాణం తర్వాత దశాబ్దం కిందట స్నాన ఘట్టాలు, కల్యాణకట్ట, మహిళలు బట్టలు మార్చుకునే గదులు ఒకేసారి నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు మరే అభివృద్ధి కార్యక్రమం గోదావరి తీరాన చేపట్టలేదు. ప్రతీ ఏడాది కనుల పండువగా ముక్కోటి సందర్భంగా ఇక్కడే తెప్పోత్సవం నిర్వహిస్తారు. ఎప్పటికప్పుడు తాత్కాలిక పద్ధతిన ఏర్పాట్లు చేస్తూ పోతున్నారు. ముక్కోటితో పాటు శ్రీరామ నవమి, విశిష్ట తేదీల్లో చేపట్టే గోదావరి హారతి, హనుమాన్ మాల విరమణ తదితర వేడుకలు/పూజలు నిర్వహించుకునేందుకు వీలుగా గోదావరి తీరంలో శాశ్వత ప్రతిపాదికన నిర్మాణాలు ఏర్పాటు చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

వేలాడే వంతెన కూడా..

రామయ్య దర్శనం చేసుకున్న భక్తులు పావన గోదావరి తీరం వెళ్లేందుకు వీలుగా ఆలయం తూర్పు ద్వారంలో మెట్ల దగ్గర నుంచి నరసింహ స్వామి ఆలయం ఉన్న గుట్ట మీదుగా కరకట్ట వరకు వేలాడే వంతెన నిర్మాణం చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. భక్తులకు అదనపు సౌకర్యం అందుబాటులోకి రావడంతో పాటు ఈ వంతెన భద్రాచలానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చెబుతున్నారు. తీరం వెంబడి రివర్ ఫ్రంట్ కేఫెటేరియా/ఫుడ్ కోర్టులను సైతం నిర్మించాలంటున్నారు.

ఆస్పత్రి అప్‌గ్రేడ్ చేస్తే ఎంతో ఉపయోగం

రాష్ట్రంలోనే అత్యంత రద్దీగా ఉండే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒకటిగా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి పేరుంది. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీలకు చెందిన ప్రజలు ఈ ఆస్పత్రికి వస్తున్నారు. ఇందులో సగానికి పైగా గిరిజనులే ఉంటారు. ఇంత కీలకమైన ఆస్పత్రిలో గడిచిన పదేళ్లుగా చెప్పుకోదగ్గ అభివృద్ధి లేదు. జిల్లాల విభజన తర్వాత ఎన్నో పట్టణాల్లో మెడికల్ కాలేజీలు వచ్చాయి. ప్రభుత్వ ఆస్పత్రుల అప్‌గ్రేడ్ అయ్యాయి. కానీ భద్రాచలం ఆస్పత్రి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. అంతర్రాష్ట్ర సరిహద్దు, గిరిజన జనాభాను దృష్టిలో ఉంచుకుని ఈ ఆస్పత్రిని బోధనాస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. భద్రాచలం బస్‌స్టేషన్‌ను మారిన పరిస్థితులకు తగ్గట్టుగా పునర్ నిర్మించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఆరని అసమ్మతి సెగలు

- హైకమాండ్ చెంతకు అసంతృప్త నాయకులు
- హైదరాబాద్‌కు వందమందితో ర్యాలీ
- పంచాయితీ పెద్దగా మంత్రి హరీశ్‌రావు
- హుటాహుటిన రాజధానికి ఎమ్మెల్యే హరిప్రియ



ఎంపీ వద్దిరాజు ఇంట్లో ఎంపీలు రవిచంద్ర, కవిత, ఎమ్మెల్సీ మధుతో అసమ్మతి నాయకుల భేటీ..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/ఇల్లెందు: ఇల్లెందు నియోజకవర్గంలో రాజుకున్న అసమ్మతి జ్వాలలు మరోసారి గుప్పుమన్నాయి. ఇక్కడి నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన హరిప్రియా నాయక్‌కు బీ ఫామ్ ఇవ్వొద్దని కోరుతూ అసమ్మతి నేతలు హైదరాబాద్ బాట పట్టారు. పార్టీ హైకమాండ్ వద్దే తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు.

టార్గెట్ హరిసింగ్

ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, ఆమె భర్త హరిసింగ్ నాయక్ నియోజవకర్గవ్యాప్తంగా పార్టీ నేతలను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలతో అసమ్మతి వర్గం నేతలంతా ఏకమయ్యారు. ఇల్లెందు, కామేపల్లి, గార్ల, బయ్యారం, టేకులపల్లి మండలాలకు చెందిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్, ఉప సర్పంచ్, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, పులిగండ్ల మాధవరావు, బయ్యారం సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, మహబూబాబాద్ జెడ్పీ చైర్మన్ ఆంగోతు బిందు తండ్రి శ్రీకాంత్, మూడ్ కృష్ణప్రసాద్, రాందాస్ తదితర పార్టీలో కీలక నేతలుగా ఉన్నవారు సుమారు వందమంది వరకు శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. ముఖ్యంగా హరిసింగ్ షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తూ తన ఆధిపత్యాన్ని చాటుకునేందుకు నియోజకవర్గంలో పార్టీని బలహీనపరుస్తున్నాడనేది అసమ్మతి నేతల వాదనగా ఉంది.

మంత్రి హరీశ్ సమక్షంలో..

గత ఏడాది నుంచి హరిసింగ్ వ్యవహార శైలి విమర్శలకు దారి తీస్తోంది. మున్సిపాలిటీలో మొదలైన అసమ్మతి జ్వాలలు ఆ తర్వాత నియోజకవర్గం అంతటా వ్యాపించాయి. దీంతో హరిప్రియకు టిక్కెట్ ఇవ్వొద్దంటూ బహిరంగంగా డిమాండ్ చేశారు. నాటకీయ పరిణామాల మధ్య చివరకు హరిప్రియనే అభ్యర్థిగా ప్రకటించారు. ఆమె విజ్ఞప్తి మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఎమ్మెల్సీ తాతా మధును తప్పించి ఆ స్థానంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్రను నియమించారు. ఆ వెంటనే అసమ్మతిని చల్లార్చేందుకు ఇరువర్గాల మధ్య రాజీ కోసం వద్దిరాజు ఇంట్లో సమావేశం నిర్వహించారు. అయితే అక్కడ కూడా రాజీ ఫార్ములా సాధ్యం కాలేదు. దీంతో పార్టీ హైకమాండ్ దృష్టికి విషయం వెళ్లింది. గురువారం మహబూబాబాద్ జిల్లా పర్యటనలో మంత్రి హరీశ్‌రావు దృష్టికి ఇల్లెందులో పార్టీ పరిస్థితులను ఎంపీ వద్దిరాజు వివరించారు. దీంతో అసమ్మతి నేతలకు హరీశ్‌రావు అపాయింట్‌మెంట్ ఇచ్చారు.

ఎమ్మెల్యేకు పిలుపు..

మంత్రి హరీశ్‌రావు అపాయింట్‌మెంట్ రావడంతో అసమ్మతి నేతలంతా శుక్రవారం మధ్యాహ్నం ఇల్లెందు నుంచి భారీగా కదలి వెళ్లారు. మరోవైపు ఎమ్మెల్యే హరిప్రియానాయక్ గార్ల మండల పర్యటనలో ఉన్నారు. అయితే మంత్రి హరీశ్ నుంచి హైదరాబాద్ రావాలంటూ ఆమెకు ఫోను వచ్చింది. దీంతో సాయంత్రం 4 గంటల సమయంలో గార్ల నుంచే ఆమె హైదరాబాద్‌కు వెళ్లారు. శుక్రవారం తుంగతుర్తి పర్యటనలో ఆలస్యం కావడంతో మంత్రి హరీశ్ రాత్రి 9 గంటలకు ఇంటికి చేరుకున్నారు. కాగా తొలుత హైదరాబాద్‌లోని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఇంట్లో ఎంపీలు వద్దిరాజు, మాలోత్ కవిత, ఎమ్మెల్సీ మధులతో అసమ్మతి నాయకులు సమావేశమయ్యారు.

బీ ఫామ్ ఇవ్వొద్దని..

గడిచిన ఏడాది కాలంగా ఎమ్మెల్యే భర్త హరిసింగ్ కారణంగా తాము ఎదుర్కొన్న ఇబ్బందులు పార్టీకి జరిగిన నష్టాన్ని అసమ్మతి వర్గం ప్రధానంగా వివరించనున్నారు. టికెట్ ప్రకటించిన తర్వాత సర్దుకుపోయేందుకు తాము సిద్ధంగా ఉన్న అటు వైపు నుంచి వేధింపులు ఆగడం లేదంటూ తమ వాదన వినిపిస్తామంటున్నారు. పార్టీ ప్రయోజనాలు ఫణంగా పెడుతున్న హరిప్రియకు బీ ఫామ్ ఇవ్వవద్దనేది తమ ప్రధాన డిమాండ్ అని ఖరాఖండీగా చెబుతున్నారు. మరోవైపు కొందరు నేతలు కావాలనే ఎమ్మెల్యేను, ఆమె భర్తను ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేశారనేది హరిప్రియ మద్దతుదారుల అభిప్రాయంగా ఉంది.

నేటి నుంచి పంచాయతీ ఆపరేటర్ల సమ్మె

జిల్లాలో విధులు బహిష్కరించనున్న 77 మంది



జిల్లా పంచాయతీ అధికారి రమాకాంత్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న ఈ-పంచాయతీ ఆపరేటర్లు

చుంచుపల్లి: పల్లె పాలనలో కీలకంగా వ్యవహరిస్తున్న ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు శనివారం నుంచి సమ్మెబాట పట్టనున్నారు. 2014-15లో ఇంటర్నెట్ ఆధారంగా గ్రామపంచాయతీలో ప్రజలకు అందుతున్న అన్ని రకాల సేవల కంప్యూటరీకరణకు ప్రభుత్వం వీరిని నియమించింది. ప్రతి క్లస్టర్ గ్రామపంచాయతీ పరిధిలో ఒక ఆపరేటర్ ఉండగా, పర్యవేక్షణకు జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌ను నియమించారు. వీరికి గ్రామపంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘం నిధుల నుంచి 10 శాతం జీతభత్యాలుగా చెల్లిస్తుంటారు. కాగా తమ సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, మండల పరిషత్ అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. నేటి నుంచి సమ్మెకు దిగనున్నారు. పే స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని, కారుణ్య నియామకాలు వర్తింపజేయాలని, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

సమస్యల పరిష్కారం కోసమే..



మా సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె చేపడుతున్నాం. ఇప్పటికైనా పాలకులు స్పందించి మా డిమాండ్లు అంగీకరించాలి.

–బి.కిషోర్, ఈ–ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

నేడు మంత్రి కేటీఆర్ రాక



హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక, ఏఎస్పీ పరితోష్ తదితరులు



అంబేడ్కర్ సెంటర్‌లో సిద్ధం చేస్తున్న శిలాఫలకం

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భద్రాచలం: రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు శనివారం భద్రాచలంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా భద్రాచలం చేరుకుని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. 12.45 గంటలకు సుభాష్ నగర్ నుంచి కరకట్ట పొడిగింపునకు, ఒంటి గంటకు అంబేడ్కర్ సెంటర్‌లో సెంట్రల్ లైటింగ్‌తో పాటుగా ఇతర పనులకు శంకుస్థాపన చేయనున్నారు. 1.15 గంటలకు కేకే ఫంక్షన్ హాల్‌లో విలేకర్ల సమావేశం నిర్వహిస్తారు. 1.30 గంటల నుంచి 2 గంటల వరకు లంచ్ బ్రేక్ ఉంటుంది. అనంతరం 2 గంటలకు తిరిగి హెలికాప్టర్ ద్వారా సత్తుపల్లికి వెళ్లనున్నారు. కాగా కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు బీఆర్‌ఎస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలో ఫ్లెక్సీలు, జెండాలతో గులాబీమయం చేశారు. కరకట్ట వద్ద, అంబేడ్కర్ సెంటర్‌లో అభివృద్ధి పనుల శంకుస్థాపన చేసే శిలాఫలకాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి శనివారం భద్రాచలంలో పర్యటించనున్న నేపథ్యంలో కలెక్టర్ ప్రియాంక ఆల శుక్రవారం రాత్రి ఏఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. టొబాకో బోర్డు ఏరియాలో ఉన్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని, కూనవరం రోడ్డులో, అంబేడ్కర్ సెంటర్, చర్ల రోడ్డులోని కేకే ఫంక్షన్ హాల్ ఏరియాలను సందర్శించారు. ఏర్పాట్లపై ఆరా తీశారు. అధికారులు అప్రమత్తంగా ఉండి పర్యటన విజయవంతం చేయాలని సూచించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఓ రమాకాంత్, భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం వచ్చే నైతిక హక్కు లేదు..



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య

- ఓట్ల కోసమే మరోసారి మోసానికి బీఆర్‌ఎస్ ప్రయత్నం
- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొదెం వీరయ్య

భద్రాచలం: సీఎం కేసీఆర్ హామీలతో భద్రాచలం ప్రాంతాన్ని మోసం చేశారని, ఆయన కుమారుడు, మంత్రి కేటీఆర్‌కు భద్రాచలంలో పర్యటించే నైతిక హక్కు లేదని డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య విమర్శించారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా రూ.100, రూ.1000 కోట్ల హామీలతో భద్రాచలం ప్రాంత ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మళ్లీ అభివృద్ధి పేరుతో శంకుస్థాపనలతో మోసం చేయటానికి వస్తున్నారని పేర్కొన్నారు.

సమాధానం చెప్పాలి..

భద్రాచలం వస్తున్న కేసీఆర్ ఆంధ్రలో కలిసిన ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలనే డిమాండ్‌కు, గోదావరి వరద బాధితులకు డబుల్ బెడ్రూంలను కట్టిస్తామని ఇచ్చిన హామీతో పాటుగా దుమ్ముగూడెం మండలం ప్రగల్లపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, చర్ల మండలం వద్దిపేట చెక్ డ్యాం, తాలిపేరు ప్రాజెక్ట్ పెండింగ్ పనులు, వెంకటాపురం మండల పాలెం వాగు ప్రాజెక్ట్ లెఫ్ట్ కెనాల్, వాజేడు మండల మోడీ కుంట వాగు ప్రాజెక్టులపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భద్రాచల ప్రాంత ప్రజల ఓట్ల కోసం శంకుస్థాపనల ఆర్భాటాలు తప్ప చిత్తశుద్ధి లేదని అన్నారు. మాయమాటలతో ప్రజలను మోసం చేసే కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతిరేల రవికుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బలుసు నాగ సతీష్, కాంగ్రెస్ నాయకులు అడబాల వెంకటేశ్వరరావు, బత్తుల తిరుపతయ్య, బంధం శ్రీనివాస్, సరెళ్ల వెంకటేష్, ఎడారి ప్రదీప్, రాసమల్ల రాము, లంక శ్రీనివాస్, సోడే చలపతి, లంక శివ, పూజారి సూరి, సరిత, జయ, ఎస్‌కే హసీనా, జానకిరాణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో వచ్చే నెల 5వ తేదీ నుంచి 1వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు ఎస్‌ఏ-1(సమ్మేటివ్ అసెస్‌మెంట్) పరీక్షలు ప్రారంభం కానున్నాయని జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వరాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1నుంచి 5వ తరగతి వరకు ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని, 6, 7 తరగతులకు ఉదయం 10 గంటల నుంచి 12.45 గంటల వరకు, 9, 10 విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 8వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పరీక్షలు ఉంటాయని వివరించారు. అక్టోబర్ 11వ తేదీ వరకు జరుగుతాయని, ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌సీల నుంచి అక్టోబర్ 4వ తేదీలోగా ప్రశ్నాపత్రాలు పొందాలని సూచించారు.

ట్రైకార్ యూనిట్లు గ్రౌండింగ్ చేస్తున్నాం

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి

చంద్రుగొండ : గిరిజనులకు మంజూరైన ట్రైకార్ రుణ యూనిట్లను గ్రౌండింగ్ చేస్తున్నామని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి తెలిపారు. గ్రౌండింగ్ ప్రక్రియలో భాగంగా చంద్రుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో రుణాల మంజూరైన వారి నుంచి దరఖాస్తులను శుక్రవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 344 యూనిట్లు మంజూరుకాగా, ఇప్పటివరకు 150 యూనిట్ల గ్రౌండింగ్ పూర్తి చేశామన్నారు. చంద్రుగొండ మండలంలోని 14 పంచాయితీలకు 21 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. వారం రోజుల్లో జిల్లావ్యాప్తంగా గ్రౌండింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఎంపీడీఓ బి.రేవతి, ఎస్‌బీఐ, గ్రామీణ వికాస్‌బ్యాంకు మేనేజర్లు రఘురాం, రవికుమార్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



చండీహోమంలో పూర్ణాహుతి..

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. తొలుత అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించాక మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం జరిపించారు. అలాగే, పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ యాగశాలలో చండీహోమం నిర్వహించారు. పూజల్లో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు గంధం వెంగళరావు, చందుపట్ల శ్రీనివాస రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సింగరేణిలో 102వ వార్షిక సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం షేర్ హోల్డర్స్‌తో 102వ వార్షిక సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. ఈ సమావేశం డైరెక్టర్ ఎన్.బలరామ్ ఆధ్వర్యాన ఏర్పాటు చేయగా, డైరెక్టర్లు వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణరావు, శ్రీనివాస్‌తో పాటు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారి అల్కా శేఖర్, కంపెనీ సెక్రటరీ సునీత పాల్గొని వివిధ అంశాలపై చర్చించినట్లు సమాచారం. అయితే, షేర్ హోల్డర్లతో జరిగిన ఈ సమావేశం అంశాలను బహిర్గతం చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలో సమావేశ వివరాలను మీడియాకు వెల్లడించినా ఈసారి విరుద్ధంగా వ్యవహరించడం గమనార్హం. కాగా, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అధి కారి అల్కా శేఖర్ కొత్తగూడెం ఏరియాలోని గనులు, సోలార్‌ప్లాంట్, రెస్క్యూ స్టేషన్‌ను సందర్శించారు. ఆమెకు జీఎం శాలేంరాజు స్వాగతం పలకగా, అధికారులు కోటిరెడ్డి, రమేష్, రవీందర్, రమణారెడ్డి పాల్గొన్నారు.

వైద్యారోగ్య శాఖ అధికారుల దాడులు

దుమ్ముగూడెం: మండలంలోని కాటాయిగూడెం గ్రామంలో ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించడంతో మృతిచెందిన తుర్రం సరోజిని కుటుంబ సభ్యులను జిల్లా మలేరియా అధికారి డాక్టర్ స్పందన, అసిస్టెంట్ మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం లక్ష్మీనగరం గ్రామంలోని ప్రైవేట్ క్లినిక్‌లు, ల్యాబ్‌ల్లో తనిఖీ చేశారు. పరిమితికి మించి వైద్యం చేస్తున్న క్లినిక్‌లను సీజ్ చేశారు. పరిమితికి మించి వైద్యం చేయొద్దని, హద్దుమీరితే కఠిన చర్యలు తీసుకుంటామని లక్ష్మీనగరం, ములకపాడు గ్రామంలోని ఆర్‌ఎంపీలు, పీఎంపీలను వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ పుల్లారెడ్డి, ఎస్‌యూఓ హనుమంతు, హెల్త్ సూపర్‌వైజర్ సాగర్, హెచ్‌ఏ ధర్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

దుమ్ముగూడెం: మండలంలోని బొజ్జికుప్ప అటవీప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై ఎస్‌ఐ కేశవరావు తన సిబ్బందితో శుక్రవారం దాడి చేశారు. జూదరులు పారిపోగా ఘటనా స్థలం నుంచి 15 ద్విచక్రవాహనాలు, 2 కోళ్లు, కత్తులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఎస్‌ఐ గణేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎప్పుడిస్తారో చెప్పండి..

- గొర్రెల పంపిణీ కోసం ఐదేళ్లుగా ఎదురుచూపులు
- జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ లక్ష్యం 3,487
- నేడు పశుసంవర్ధక శాఖ కార్యాలయం ముట్టడి



సూపర్‌బజార్(కొత్తగూడెం): సుమారు ఐదేళ్ల సుదీర్ఘ కాలం తరువాత రెండో విడత గొర్రెల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కానీ, ఆచరణలో మాత్రం ముందడుగు పడటం లేదు. రెండో విడత గొర్రెల పంపిణీ జిల్లా లక్ష్యం 3,487 యూనిట్లు కాగా ఇప్పటివరకు కేవలం 237 యూనిట్లు మాత్రమే పంపిణీ కావడంతో ప్రక్రియలో ఎంత అలస్యం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

పెరిగిన యూనిట్ ధర, లబ్ధిదారుడి వాటా

జిల్లాలో మొదటి విడత కంటే రెండో విడతలో యూనిట్ ధరతో పాటు లబ్ధిదారుని వాటా కూడా పెరిగింది. మొదటి విడతలో జిల్లా లక్ష్యం 7,511 యూనిట్లు కాగా లక్ష్యాన్ని చేరుకుంది. అప్పుడు యూనిట్ ధర రూ.1.25 లక్షలు కాగా లబ్ధిదారుడు 25 శాతం కింద తన వాటాగా రూ.31,250 చెల్లించారు. రూ.93,750 సబ్సిడీ ఉండేది. పెరిగిన ధరలతో రెండో విడతలో యూనిట్ ధర రూ.50 వేలు పెరిగి రూ.1.75 లక్షలకు చేరుకుంది. దీంతో లబ్ధిదారుడు తమ వాటాగా 25 శాతం అంటే రూ.43,750 చెల్లించాల్సి వస్తోంది.

ఇప్పటి వరకు 2,242 మంది చెల్లింపు

జిల్లాలో 3,487 యూనిట్లు లక్ష్యంకాగా ఇప్పటి వరకు లబ్ధిదారుని వాటాగా 2,242 మంది రూ.43,750 చొప్పున చెల్లించారు. వారిలో 237 మందికి గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. ఇంకా వాటా చెల్లించిన 2005 మందికి గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉంది. 1,245 మంది ఇంకా వాటా చెల్లించాల్సి ఉంది.

శాఖల మధ్య సమన్వయ లోపం..

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రెండో విడత గొర్రెల పంపిణీని ఆర్భాటంగా ప్రభుత్వం ప్రారంభించింది. గతంలో కేవలం పశుసంవర్ధక శాఖాధికారులు మాత్రమే గొర్రెల పంపిణీ ప్రక్రియను నిర్వహించేవారు. రెండో విడత పంపిణీలో ప్రభుత్వం పెట్టిన నిబంధనలు శాపంగా మారాయి. మండలస్థాయిలో కమిటీలను వివిధ ప్రభుత్వ శాఖలతో వేసి, ఆ మండల కమిటీలకు ఒక జిల్లాస్థాయి అధికారిని పర్యవేక్షకులుగా నియమించారు. దీంతో వారి మధ్య సమన్వయ లోపం కారణంగా ప్రక్రియ ఆలస్యమవుతోందని సమాచారం. ఆ శాఖాధికారికి పశుసంవర్ధక శాఖపై అవగాహన లేకపోవడం, గొర్రెల కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు తెలియక పోవడం వల్ల కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దూరంగా ఉన్న రాష్ట్రం నుంచి గొర్రెలను కొనుగోలు చేయడం వాటిని జిల్లాకు తీసుకువచ్చే సరికి రవాణా బడలికతో అవి రోగాలబారిన పడి తరువాత మరణించడంతో లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. సమీప రాష్ట్రం నుంచి నాణ్యమైన గొర్రెలను పశుసంవర్ధక శాఖకు సంబంధించిన అధికారులతో కొనుగోలు చేయిస్తే న్యాయం జరుగుతుందని సంబంధిత సంఘాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి. లేదా వివిధ పథకాలలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో డబ్బులు జమచేసిన విధంగా గొర్రెల పథకంలో కూడా లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో డబ్బులు జమ చేస్తే నాణ్యమైన గొర్రెలను కొనుగోలు చేసుకుంటామని మరికొన్ని సంఘాలు కోరుతున్నాయి. కాగా, గొర్రెల పంపిణీ పథకంలో అవకతవకలను అరికట్టాలని, నాణ్యమైన గొర్రెలను పంపిణీ చేయాలని, దళారీ వ్యవస్థను రూపుమాపాలనే తదితర డిమాండ్లతో శనివారం జిల్లా గొర్రెల సహకార సంఘాలు, జిల్లా అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయాన్ని ముట్టడించడానికి సిద్ధమయ్యారు.

దళారీ వ్యవస్థను వ్యతిరేకిస్తున్నాం



గొర్రెల పంపిణీ పథకంలో రాజకీయ దళారి వ్యవస్థను వ్యతిరేకిస్తున్నాం. పంపిణీలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలి. ముందు డీడీలు తీసిన వారికి ముందుగా మంజూరు చేయాలి. సమస్యలను పరిష్కరించాలని శనివారం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నాం. **–వల్లపు యాకయ్య, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి**

ఎదురుచూస్తూనే ఉన్నాం..



మా వాటాను చెల్లించి గొర్రెలు ఎప్పుడు ఇస్తారోనని ఎదురు చూస్తున్నాం. చాలా ఆలస్యం చేస్తున్నారు. అనేక ఇబ్బందులు ఎదుర్కొని మా వాటాను చెల్లించాం. ఇప్పటికైనా త్వరగా నాణ్యమైన గొర్రెలను కొనుగోలు చేసి మాకు ఇప్పించాలి. ముందుగా డీడీలు చెల్లించిన వారికి కేటాయించాలి.
– చీమల కుమారస్వామి, పాండురంగాపురం

గొర్రెల పంపిణీని పూర్తి చేస్తాం



జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని (గొర్రెల పంపిణీ) పూర్తి చేస్తాం. నాణ్యమైన, ఆరోగ్యవంతమైన గొర్రెలనే కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందిస్తాం. లబ్ధిదారులెవరికీ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటాం. గొర్రెల పంపిణీకి సంబంధించి పనులను ముమ్మరం చేస్తున్నాం.
–పురంధర్, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అభివృద్ధికి ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని ఆర్టీసీ ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజినల్ మేనేజర్ వెంకన్న తెలిపారు. శుక్రవారం మణుగూరు ఆర్టీసీ డిపోలో ఆగస్టు నెలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ఆయన నగదు, ప్రశంసా పత్రాలు, ప్రగతిచక్రం పురస్కారాలను అందజేసి మాట్లాడారు. రానున్న దసరా పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించి, ఆదాయం పెంచాలన్నారు. డ్రైవర్లు విధి నిర్వహణలో సెల్‌ఫోన్ వినియోగించొద్దని, మద్యం సేవించొద్దని సూచించారు. కార్యక్రమంలో డీఎం స్వామితోపాటు కనకదుర్గ, మూర్తి పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌ఎం వెంకన్న

బస్టాండ్‌లో సౌకర్యాలు మెరుగుపరుస్తాం

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లెందు: ఇల్లెందు ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు మెరుగుపరుస్తామని ఆర్‌ఎం వెంకన్న తెలిపారు. బస్టాండులో నెలకొన్న అసౌకర్యాలపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆర్‌ఎం స్పందించి, శుక్రవారం బస్టాండ్‌ను సందర్శించారు. తాగునీటి కుళాయిలు, మూత్రశాలలు, పారిశుద్ధ్యం, ప్రైవేట్ వాహనాల రాకపోకలు, లైట్లు, ఫ్యాన్ల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్టాండ్‌లో సమస్యలు గుర్తించామని, వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం డిపోలో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ పవిత్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కేటీఆర్ సమక్షాన బీఆర్‌ఎస్‌లో చేరిక

భద్రాచలం/చర్లరూరల్: భద్రాచలం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పలువురు నాయకులు బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, భద్రాచలం బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు సమక్షంలో పార్టీలో చేరినవారికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కండువాలు కప్పి స్వాగతం పలికారు. రానున్న ఎన్నికల్లో భద్రాచలం నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కేటీఆర్ కోరారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో చర్ల ఎంపీపీ కోదండరామయ్య, భద్రాచలానికి చెందిన నాయకులు తాళ్ల రమేశ్‌గౌడ్, బొలిశెట్టి రంగారావు, తాండ్ర నర్సింహారావు, రేపాక పూర్ణచందర్‌రావు, హన్మంతరావు, గూడపాటి సతీశ్, దుమ్ముగూడెం మండల ఎంపీటీసీలు కూసం ధర్మరాజు, సోడి తిరుపతిరావు, మడకం రామారావు, సర్పంచ్‌లు మడకం నాగేంద్రబాబు, గొంది వెంకటేశ్వర్లు, వర్సా చిన్నారావు, తెల్లం రామకృష్ణ, తెల్లం నరేశ్, ఉబ్బా వేణు, తోట రమేశ్, చర్ల, వాజేడు మండలాల నాయకులున్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన నేతలతో మంత్రి కేటీఆర్ తదితరులు

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

చర్ల: మండలంలోని కలివేరులో మద్యం మత్తులో ఓ వ్యక్తి సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. గ్రామానికి చెందిన మల్లం బాబూరావుకు మద్యం సేవించే అలవాటు ఉండగా నిత్యం మద్యం సేవించి తిరుగుతూ ఉండటంతో నాలుగేళ్ల కిందట ఆయన భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసగా మారి శుక్రవారం ఆయన ఇంటి ఎదుట ఉన్న సెల్ టవర్ ఎక్కాడు. 'నా భార్య నా దగ్గరకు రావాలి. ఆమె రాకపోతే నేను ఇక్కడి నుంచి దూకి చనిపోతా' అని కేకలు వేయడంతో స్థానికులు సర్ది చెప్పి కిందకు దించారు. గతంలోనూ పలుమార్లు సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడని, మద్యం తాగిన ప్రతీసారి ఇలానే వ్యవహరిస్తూ ఉంటాడని, మతిస్థిమితం కూడా సరిగ్గా లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

రూ.50 వేలు జరిమానా

జూలూరుపాడు: నాటు సారా విక్రేతకు స్థానిక తహసీల్దార్ శారద శుక్రవారం రూ.50 వేలు జరిమానా విధించారు. కొత్తగూడెం ఎక్సైజ్‌శాఖ సీఐ ఎల్.జయశ్రీ కథనం ప్రకారం.. మండలంలోని కరివారిగూడెం జీపీ తవిసిగుట్టతండాకు చెందిన బోడా బుల్లి గతంలో నాటు సారా అమ్ముతూ పట్టుబడితే బైండోవర్ చేశారు. ఇటీవల బుల్లి నాటు సారా విక్రయిస్తూ తిరిగి పట్టుబడటంతో ఆమెపై కేసు నమోదు చేశారు. తహసీల్దార్ శారద ఎదుట హాజరు పరచడంతో బైండోవర్ ఉల్లంఘన కింద బుల్లికి రూ.50 వేలు జరిమానా విధించారని సీఐ జయశ్రీ తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు సాయికుమార్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరి తోటల విస్తరణపై దృష్టి

- తెలంగాణ రైతుల్లో ఆసక్తి పెంచేందుకు కృషి
- కొబ్బరి అభివృద్ధి బోర్డు డీడీ కుమార్‌వేల్



మాట్లాడుతున్న డీడీ కుమార్‌వేల్

అశ్వారావుపేటరూరల్: తెలంగాణలో కొబ్బరి సాగుకు అనుకూలంగా ఉండే ప్రాంతాల్లో తోటలను విస్తరించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కొబ్బరి అభివృద్ధి బోర్డు ఉమ్మడి ఏపీ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ కుమార్ వేల్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని గంగారం సమీపాన కొబ్బరి తోటలో శుక్రవారం సీడీబీ, ఉద్యాన శాఖ ఆధ్వర్యాన రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ.. రికార్డుల ప్రకారం ఏపీ కంటే తెలంగాణలో కొబ్బరి తోటల సాగు విస్తీర్ణం చాలా తక్కువగా ఉందని, దీంతో కొబ్బరి అభివృద్ధి మండలి బోర్డు ద్వారా రూ.51 లక్షలు కేటాయించి, రైతుల్లో ఆసక్తి పెంపొందిస్తున్నామని తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి జినుగు మరియన్న మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం, ఉద్యాన శాఖ ఆధ్వర్యాన కొబ్బరి తోటలు సాగు చేసే రైతులకు ఎకరానికి 40 మొక్కల చొప్పున రాయితీపై రూ.36కు అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో రావు జోగేశ్వరరావు, మత్తే కిరణ్‌కుమార్, సందీప్‌కుమార్, జయకుమార్, ఐవీఎస్ రెడ్డి, లక్ష్మీరాజు, చిన్నంశెట్టి సత్యనారాయణ, ఆలపాటి రాము, కె.పుల్లయ్య, ప్రకాశ్‌రావు, తలశిల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో వృద్ధుడికి గాయాలు

ములకలపల్లి: కోతుల దాడిలో వృద్ధుడు తీవ్రంగా గాయపడిన ఘటన ములకలపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కుంచమర్తం కృష్ణమూర్తి తన ఇంటి పెరట్లో పనిచేస్తుండగా కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. అతడి కేకలు విని చుట్టుపక్కలవారు వచ్చి కోతులను తరిమేశారు. వృద్ధుడి కుడిచేయికి తీవ్ర గాయం కాగా, వీపుపై గాట్లు పడటంతో మంగపేట పీహెచ్‌సీకి తరలించారు.

అడవిగేదెను వేటాడి చంపిన గొత్తికోయలు

ఎనిమిది మందిపై కేసు నమోదు

గుండాల: అడవిగేదెను వేటాడి చంపిన ఎనిమిది మంది గొత్తికోయలపై అటవీ అధికారులు కేసు నమోదు చేశారు. గుండాల మండలం బాటన్ననగర్ గ్రామానికి చెందిన కొందరు రెండు రోజుల కిందట అడవి గేదెను వేటాడి హతమార్చారు. ఈ విషయం బయటకు పొక్కడంతో విచారణ అనంతరం పాయం జోగయ్య, పాయం ఇడమయ్య, నందయ్య, భీమయ్య, తాటి వెంకటకుమార్, కాంతయ్య, ఊకే రాంలాల్, మడకం లాలయ్యపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు కాచనపల్లి రేంజర్ దీపిక తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు

అశ్వాపురం: మండలంలోని మిట్టగూడెం గ్రామ సమీపంలో బట్టీలగుంపు మూలమలుపు వద్ద శుక్రవారం రాత్రి కారు చెట్టును ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన పాయం సురేంద్ర, అనిల్ గొల్లగూడెం గ్రామానికి చెందిన కోటేశ్ మణుగూరు మండలం మల్లారం గ్రామానికి చెందిన కల్యాణ్ కారులో కుమ్మరిగూడెం నుంచి మిట్టగూడెం వైపు వస్తున్నారు. బట్టీలగుంపు వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. వారిని మణుగూరు ఆస్పత్రికి తరలించారు. అనిల్, కోటేశ్‌ను మెరుగైన వైద్యం కోసం భద్రాచలంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

భద్రాద్రిలో నిమజ్జనానికి బారులు

రాష్ట్రం నలుమూలల నుంచి గణనాథులతో వచ్చిన భక్తులు



భద్రాచలంలో గణనాథులతో బారులు దీరిన వాహనాలు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని గోదావరిలో గణనాథుల నిమజ్జనం మూడో రోజైన శుక్రవారం కూడా కొనసాగింది. రెండు రోజులు తక్కువ సంఖ్యలో విగ్రహాలు రావడంతో శుక్రవారం అలాగే ఉంటుందని అధికారులు భావించారు. కానీ, గురువారం అర్ధరాత్రి దాటాక రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో విగ్రహాలతో భక్తులు రాగా పట్టణంలోని కూనవరం రోడ్డు నుంచి నిమజ్జన ఘాట్ వరకు వందల సంఖ్యలో వాహనాలు సుమారు రెండు కి.మీ. మేర నిలిచిపోయాయి. ఫలితంగా భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలే కాక ఇతర ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను భద్రాచలంలోని గోదావరిలో నిమజ్జనం చేసేందుకు భక్తులు ఆసక్తి చూపుతారు. దీంతో గతేడాది నుంచి నిమజ్జన ఘాట్ ఏర్పాటు చేశారు. ఈ ఏడాది భారీ సంఖ్యలో విగ్రహాలు వస్తాయని అంచనా వేసినా, తొలి రెండు రోజులు తక్కువగానే వచ్చాయి. శుక్రవారం అధికారులు తాత్కాలిక సిబ్బందిని తగ్గించారు. శుక్రవారం తెల్లవారే సరికి ఊహించని స్థాయిలో విగ్రహాలు రావడం, సిబ్బంది లేకపోవడంతో నిమజ్జనం ఆల్యమైంది. చివరకు మేల్కొన్న అధికారులు విగ్రహాలను నాలుగు క్రేన్ల ద్వారా నిమజ్జన ఘాట్ వద్ద దించి వాహనాలను పంపించాక లాంచీల్లో తీసుకెళ్లి నిమజ్జనం జరిపించారు. బుధ, గురువారాల్లో 800 విగ్రహాలను నిమజ్జనం చేయగా, శుక్రవారం ఒకేరోజు 1,200 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

బాలుడి మృతదేహం లభ్యం



గణేశ్‌తేజ మృతదేహం

భద్రాచలంఅర్బన్/టేకులపల్లి: గోదావరిలో గురువారం గల్లంతైన బాలుడు గణేశ్‌తేజ (14) ప్రాణాలు కోల్పోగా శుక్రవారం ఉదయం మృతదేహం లభించింది. వివరాలిలా ఉన్నాయి.. టేకులపల్లి మండలం ఈర్యతండాకు చెందిన గణేశ్‌తేజ స్నేహితులతో కలిసి వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు గోదావరిలో దిగి గల్లంతైన విషయం విదితమే. పోలీసులు, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది శుక్రవారం ఉదయం 5 బోట్లతో గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడి మృతదేహం గల్లంతైన ప్రదేశానికి రెండు కిలోమీటర్ల దూరంలో లభించింది. ఏరియా ఆస్పత్రి వైద్యులచే నది ఒడ్డున పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాన్ని చూసి బాలుడి తల్లిదండ్రులు బాలాజీ, నీల, అన్న యశ్వంత్ కన్నీటిపర్యంతమయ్యారు. కాగా, గణేశ్‌తేజ మృతితో టేకులపల్లి మండలం ఈర్యాతండాలో విషాదం అలుముకుంది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



నరేశ్ (ఫైల్)

దమ్మపేట: రహదారిపై నడుస్తూ వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని ముష్టిబండలో శుక్రవారం చోటుచేసుకుంది. ముష్టిబండకు చెందిన చిలకా నరేశ్(35) శుక్రవారం తెల్లవారుజామున రాష్ట్రీయ రహదారిపై నడుస్తూ వెళ్తున్నాడు. వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం నరేశ్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, మృతదేహాన్ని అశ్వారావుపేటలోని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

చికిత్స పొందుతున్న యువకుడు...

దమ్మపేట: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గండుగులపల్లి గ్రామానికి చెందిన సోయం అరవింద్ (18) ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో అరవింద్.. తనకు పెళ్లి చేయాలని తల్లి సోయం కుమారిని అడిగాడు. భార్యను ఎలా పోషిస్తావని తల్లి కుమారుడిని అడిగింది. దీంతో ఈ నెల 19న అరవింద్ పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

పశువులు తరలిస్తున్న వాహనాల పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అనుమతి లేకుండా కబేళాకు పశువులను తరలిస్తున్న రెండు వాహనాలను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. అశ్వారావుపేట సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా ఏపీలోని జీలుగుమిల్లి వైపు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న రెండు భారీ కంటైనర్‌లను పరిశీలించారు. వాహనాల్లో 45 ఆవులు, 55 ఎద్దులు ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కేరళ వాసి కేవీ విష్ణు, తమిళనాడు వాసి కె.శ్రీనివాసన్ ఏపీలోని విజయనగరం జిల్లా పార్వతీపురం సంతలో పశువులను తక్కువ ధరకు కొనుగోలు చేసి తమిళనాడులోని సేలం ప్రాంతంలో విక్రయించేందుకు తరలిస్తూ పట్టుబడినట్లు తేలింది. వారిద్దరిపై కేసు నమోదు చేసి, పట్టుబడిన పశువులను పాల్వంచలోని గోశాలకు తరలించి, రెండు వాహనాలను సీజ్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.